# నిరీక్షణ

గుత్తుల భాస్కరరావు




అపరాహ్ణం.

సూర్యుడు నడినెత్తికెక్కి మంకుపట్టు పట్టిన వేళ.

ఆ మురికిపేటకి గుండెకాయలాంటి సెంటర్‌లో తన గుడిసె పక్కన నిలబడి చూపుకి చెయ్యివాలు వుంచుకుని నీలమ్మ ఎదురుచూస్తూంది...రోడ్డువంక ఎప్పట్నుంచో నిరీక్షణ.

గాజు స్ఫటికం ఎండలోకి విసిరితే - సూర్యుడి కిరణాల్ని రెట్టింపు కాంతితో తిప్పికొట్టినట్టు - పరిస్థితులకి రోడ్డున పడ్డ నీలమ్మ అందం ఎండకే దివిటీ పట్టింది.

నీలమ్మది చీరవయసైనా చిరుగుల వోణీ కట్టింది. మెళ్ళో పసుపుతాడు ఒంటిరంగులో కలిసిపోయి కన్నెపిల్లే




నేమో అని భ్రమ పుట్టిస్తూంది. పోటీల్లో నెగ్గిన ప్రపంచ సుందరీమణులు నీలమ్మతో తిరిగి పోటీ చేస్తే ఓడిపోయి బహుమతి కిరీటాలు ఆమె పాదాల ముందుంచి వెనక్కి తగ్గవలసిందే. దారిద్ర్యం దృష్ట్యా నీలమ్మలాంటివాళ్ళ అందం అందాల పోటీవరకూ రావడం అటుంచి అన్నం సంపాయించుకోడానికి అనర్హత కాకపోతే అదే పదివేలు.

ఎండ 'చురుకు చురుకు' తుంది.

నీలమ్మ ఎదురుచూస్తుంది. ఆవేదన ఆమె అందాన్ని పక్కకునెట్టి కళ్ళలోంచి తొంగిచూస్తుంది.

నీలమ్మ గుడిసె కెదురుగా కిళ్ళీకొట్టు!

నిత్యకళ్యాణం - నిరోధ్ తోరణాలతో విలసిల్లుతున్న కిళ్ళీకొట్టు - పనీ పాటా లేని బేవార్సు గుంపుకి ఆలవాలమైన కిళ్ళీకొట్టు.

నలుగురు కుర్రగాళ్ళు — ఆ సెంటర్‌కి కొత్తవాళ్ళు - పోతూ పోతూ నీలమ్మ కంటపడగా - కిళ్ళీకొట్టు సరసన చేరారు. ఆమె నిరీక్షణ వాళ్ళ వెకిలి మనసుల్ని కెలికింది. వాళ్ళు సిగరెట్లు కొనుక్కొని దొప్ప తాడుతో వెలిగించుకుని పొగవదుల్తూ నీలమ్మ అందాన్ని పొగలో వడబోసి చూడసాగారు.

"సెంటర్లో సుందరి ! చూడండ్రా - సిగ్గులేకుండా"

"ఎవడ్నో వెయిటింగ్ లిస్టులో పెట్టింది గురూ".

"చూడండిరా పబ్లిగ్గా విరహం..."

సిగరెట్ల పొగతోపాటు విసుర్లు

వదిలారు. ఎగబడి చూస్తున్న ఆ నలుగురిలో ఒక్కడూ ఆమె చూపుల్లో చోటు చేసుకోలేకపోయాడు. ఎవరి దుర్భాషలూ ఆమె చెవి సోకలేదు. ఆమె కిట్రప పంచంతో సంబధం లేనట్టు - జీవితాంతం ఎదురుచూడ్డం తప్ప మరో పనిలేనట్టున్నాయి ఆమె కళ్ళు...నెత్తిన ప్రత్యక్షంగా...అరికాళ్ళలో తార్రోడ్డు. సాయంత్రో పరోక్షంగా...కక్ష తీర్చు కుంటున్న ప్రచండభానుని ప్రతాపం దిగమింగుకుంటూ...

"దీనికి పెళ్ళైనట్టుందిరా."

"గుడిసెలో పిల్ల లున్నార్రా దీని పిల్లలే గాబోలు"

"ఏదైతే గురూ. అది మనలాంటి హీరోకోసమే ఎదురుచూస్తుంది."

స్వయంవరానికొచ్చి, రాకుమారి దండకోసం మేం మేం అని మెదలు సారించే రాకుమారుల్లా వాళ్ళు నలుగురు అటు యిటు పచార్లుచేసి ఫలితంలేక విసిగిపోయి తిరిగి కిళ్ళీకొట్టు నీడన చేరుకొన్నారు.

ఆమె దృష్టి రోడ్డువైపు.

వాళ్ళ దృష్టి ఆమెవైపు.

గుడిసెలో గోల బయలుదేరింది. ఉన్న ఇద్దరు పిల్లలు ఆరునొక్క రాగం అందుకున్నారు. పేరుకు అది గుడిసెగానీ పేదరికానికి ఓపెన్ ఆడిటోరియం. పిల్లల్ని సముదాయిం చాలని నీలమ్మ గుడిసెలోకి గాభరాగా దూరింది. తల్లిని చూసి పిల్లలు మరె రెచ్చిపోయి ఏడ్చారు. ఒకే కౌగిల్లో ఇద్దర్నీ చేర్చుకుని బుజ్జగించింది. వాళ్ళని వదిలి కుండలో నీళ్ళు ముంచి చెరో గ్లాసు ఇచ్చింది. అది మంత్రజలమో, ఏవిటోగానీ తాగి తక్కున ఏడుపు ఆపేశారు. ఏడవకపోతే వాళ్ళు యిద్దరు. ఏడిస్తేమటుకు వందమంది.

'అమ్మయ్య' గండం గడిచిం' దను కుని నీలమ్మ గుడిసెలోంచి బయటపడి యధాస్థానానికి వెళ్ళి నిరీక్షించసాగింది.

"మేం చంకనాకిపోయాం. ఎవడో అవ్వాయి తువ్వాయిగాడి కోసం ఎదురు చూస్తుంది" నలుగురిలో ఒకడు గొణి గాడు...నీలమ్మ దృష్టి నాకట్టుకోలేక పోయినందుకు నీరసపడి.

"పదండ్రా పోదాం."

"అగ్గురూ ! యివాళ అమీ తుమీ తేల్చుకోవాలి."

గుడిసెలో పిల్లలు మళ్ళీ ఏడ్పు మొదలుపెట్టారు. ఈసారి ఉండీ లేని పైకప్పు పూర్తిగా తప్పుకొనేలా. నీలమ్మ బొమ ముడిచి ఉక్రోషంగా గుడిసెలోకి వెళ్ళింది. తపీ తపీమని చెరో రెండు చురుగ్గా అంటించింది. ఈ మందూ పనిచేసింది వాళ్ళు నోళ్ళు మూసుకుని తల్లివంక బొమ్మల్లా చూస్తుండిపోయారు. నీలమ్మ బాధగా చేతులవంక చూసు కుంటూ...బాధ పిల్లల కంటపడనివ్వ కుండా జాగ్రత్తపడి బయటకు వచ్చింది

రీట్టింపు సత్తువ తెచ్చుకుని రోడ్డు పుట్టుక వరకూ చూపులు పొడిగించి చూసింది.

"చూడండ్రా, ఆ హీ రో గా డి కెవడికో ప్రోగ్రాం యిచ్చింది. వాడు రాలేదని పిల్లల్ని చావబాదేసింది."

"అవున్గురూ, ప్రణయ విరహం పక్కదారి తొక్కింది."

కాస్సేపటికి...

సూర్యుడికి విసుగుపుట్టి ... తూర్పు పడమర సంధ్యలో గింజుకుని పడమటి వైపు రవ్వంత మొగ్గుచూపేటప్పటికి

ఆశలు రోడ్డుమీదే పరచుకున్న నీలమ్మ కళ్ళు మెరిసాయి...ఆకాశంలో ఎదురుచూసిన నక్షత్రం కంటబడ్డట్టు ఎండి రంగు విరిగిన పెదాలు విచ్చు కోగా నీలమ్మ నవ్వింది.

ఆమె చూపులు అందుకుని వాళ్ళు నలుగురూ కనక్షన్ కోసం ప్రయత్నిం చారు.

ప్రళయకాల రుద్రుడిలా ...... కండలు తిరిగి ...ఆవిరి కక్కుతూ... స్వేదజలంతో ఎండలో ఒళ్ళంతా వెండిరేకు కప్పుకున్నట్టు మెరుస్తుంటే లాగుడుబండి లాక్కొస్తున్నాడు అతను.

"ఎవడ్రా వాడు ?"

"ఎవడో లాగుడుబండిగాడు...ఓరి చివరికి లాగుడుబండిగాడి కోసమా యిది కాపుకాసింది...ప్రేమ గుడ్డిదిరా."

"యిది గుడ్డిప్రేమ నడ్డిప్రేమ కాదురా లాగుడుప్రేమ."

అంతవరకూ ముభావంగా వున్న కిళ్ళీకొట్టు తాత మౌనంగా ఉండలేక పోయాడు. వేళ్ళసందులోంచి తుపుక్కున బైటికి ఉమ్మి, వాళ్ళని మందలించాడు.

"ఊరుకోండయ్యా, ఆ అమ్మాయెవ రనుకున్నారు ? అగ్గిగుండం. ఆడెవరను కున్నారు ? ఆ యమ్మాయి భరత. మీ యందర్ని యిరిసేసి బండిమీదేసు కుని లాక్కుపోగలదు జాగరత."

నలుగురూ మొహమొహాలు చూసు కున్నారు. జావకారిపోయి ... ఒకడి తర్వాత ఒకడు క్యూలో జారుకున్నారు.

లాగుడుబండి నీలమ్మ ముందాగింది. కారుతున్న చెమట కళ్ళని కప్పుతుంటే అతను నీలమ్మవంక నవ్వుతూ చూశాడు.

నీలమ్మ అతన్నీ నవ్వునీ పట్టించు కోకుండా చెంగున ముందుకెళ్ళి చేతు ల్లోంచి చిన్నసంచి లాక్కుని ... గుడిసెలోకి దూకి పిల్లల్ని "లెగండిరా" అని హుషారుచేస్తుంటే తెలిసింది ... ఆమె ఎదురుచూసింది భర్తకోసంవు కాదు ... ఆ పూట బియ్యం కోసమని. అంతకుముందు పిల్లలకి నీళ్ళిచ్చినా, చావబాదినా అది పిల్లల ఆకలి కప్పెయ్యడం కోసమని.

———